మూఁడు తమాషాలు

వేలూరి శివరామశాస్త్రిగారు

శ్రీ తిమ్మజగపతిరాజుగారు రాజ్యమునకు వచ్చినతోడనే కందా కందా నిండిపోయెను. గబ్బిలములు మాత్రమే నివసించు శాల లన్నియు దివ్యభవనములుగా మాఱెను. చుట్టములు, చుట్టముల చుట్టములు, వారి చుట్టములు, మిత్రులు, మిత్రుల మిత్రులు, వారి మిత్రులు, మిత్రుల చుట్టములు, వారి చుట్టములు, వారీ వీరీ మిత్రులు, నవుకరులు, వారి బంధుగులు, వారి మిత్రులు, ఆ మిత్రుల బంధుగులు. ఇటులు మితీ మేరా లేని జనము దివాణములో శేవిణీ. వీరిలో నూటికి తొంబది తొమ్మిది మంది రాజుగారి పేరు ఎఱుఁగరనినచో వారి ముఖముకూడ ఎఱుఁగ రని చెప్పవలసిన పని లేదు.

వీరి కందఱకు ఇండ్లు వాకిళ్లు, పెండ్లిండ్లు పేరంటములు పురుళ్లు, గిరుళ్లు, సమస్తమూ దివాణమే భరించుట. ప్రతి-అణువు ప్రతిపరమాణువు తిమ్మజగపతిరాజుగారు తిమ్మజగిపతిరాజుగారు అని కీర్తించుచున్నది.

తిమ్మజగపతిరాజు ఒకనాఁడు సభాభవనమున కూర్చుండెను. సేవకుఁడు దూరమున.

అతని మనస్సున మూఁడు విషయములు మూఁడుకోట్ల విషయములై ముప్పతిప్పలు పెట్టుచుండెను. ఒకటి—దివాణమున మితి లేని దాసికలు, రెండు—సేవకులు, మూఁడు సంగీత సభ్యులు. ఈ మూఁడును మూఁడే, అందు ఈ మూఁడవ విషయము మూర్ఖాకరము. సంగీతసభ్యులలో ఎక్కువమంది సువారపు దొరలు. ముత్తాతలు తాతలు తండ్రుల వరుసగా వచ్చుచున్నవియు, ఇష్టదేవతలవలె అర్చింపఁబడునవియు, వేలకువేల చిల్లులను దుర్గుణములవలె లోన దాఁచుకొనునవియు, మడతలు విప్పఁచో మానము దక్కని వస్త్రములను ధరించి, పాపము వంశప్రతిష్ఠను జాత్యాభిజాత్యమును రక్షించుటయే తమ యునికికి ప్రయోజన మనిపించు ఈ సభ్యులను చూచినపు డెల్ల తిమ్మ జగపతిరాజుగారికి చంద్రునిలో కళంకము గుఱుతు దవులును. వారి పొగడితలు వినినపుడు అతనికి కర్ణశూల. మొన్న జరిగిన సంగీతసభలో వారి మెచ్చికోలును, అభిజ్ఞతాసూచకమగు బళిబళీయను అఱపులును, వీని అన్నిటికంటె మిక్కుటముగా తల ఆడించుటయు రాజుగారి మనోజ్వరమునకు నిదానము. తిమ్మజగపతిరాజుగారు వీని నన్నిటిని తలఁచి తలఁచి చింతానిమగ్నులై యుండి ద్వారమున పదశబ్దము వినెను.

షరాబు కుటుంబ వ్యయపు చిత్తా తెచ్చి తిమ్మజగపతిరాజుగారి కిచ్చి నిలువఁబడెను. నౌకరు గంటమును ఒరనుండి పైకి తీయుచుండెను. రాజుగారు చిత్తా తేరిపాఱఁ జూచిరి.

ఆదాయపు మొత్త మంతయు కేవల కుటుంబ పోషణమునకే సరిపోయెను.

కుటుంబమున కేవలము తాను తన భార్యయు. ఈ యిరువురకు రాజ్యమున వచ్చు ధన మంతయు ఖర్చు!

రాజుగారు తెలతెలఁబోవుచు షరాబు కేసి చూచిచూచి ఆకాశముకేసి మొగము ఎత్తిరి. నౌకరు గంటమును చేతి కిచ్చెను.

నవుక రిచ్చిన గంటము ఇచ్చినరీతిగనే రాజుగారి చేతిలో ఉండెను.

షరాబు అనెను—దేవర వారు ఆలకించునెడల మనోవినోదమునకు ఒక కథ చెప్పెదను. రాజుగారు 'మంచిది' అనిరి. షరాబు చెప్పఁ దొడఁగెను—తొల్లి తంజావూరు మహారాజులుంగారు సోమరిపోతులకు ఒక సత్రము వేసిరి.

రాజుగారు నడుమ అడ్డమువచ్చి 'అటువంటిది ఉండునా? అని అడిగిరి.

షరాబు ధైర్యముతో నవ్వి—అయ్యా! అటులు అనకుఁడు. మన దేశమున నక్కఊళలను విని చలిచేఁగాఁబోలు ఏడ్చుచున్నదని దుప్పటుల తానులుతానులు చింపించి అరణ్యమంతయు పఱపించిన పుణ్యపురుషు లున్నారు. పామునోట కప్ప అడ్డుపడఁగా దానిని తొలఁగించిన బ్రాహ్మణులకు అగ్రహారము లిచ్చిన ధర్మదాత లున్నారు. గారెల మాన్యములు, బూరెల మాన్యములు అరిసెల మాన్యములు అనేకములిచ్చిన శక్తిగ్రహణపారీణు లున్నారు.

రాజుగారు అడ్డమువచ్చి 'సరే' అనిరి. షరాబు మరల ఇటులు కథను అందుకొనెను. —తంజావూరు మహారాజులుంగారు సత్రము వేసిన మఱుదినము లగాయతు దేశమంతట సోమరిపోతులు తయారయిరి. సత్రమునకు ఇండ్లు చాలలేదు. పాకలు వేసిరి. పాకలకు నగరము చాలలేదు. స్థలములు ఉన్నంతవరకు పాకలు, పందిళ్లు పాఁకిపోయినవి. రోజురోజూ పాకలుపందిళ్లు వేయుచునే యుండిరి. వచ్చుచున్న సంసారములు వచ్చుచున్నవి; పడుపాకలు పడుచున్నవి. అందులనే వడుగులు, పెండ్లిండ్లు, శోభనములు, సీమంతములు, పురుళ్లు, పుణ్యములు జరుగుచున్నవి.

రాజుగారి పెదవులపై కనీకనఁబడకుండ ఒక చిఱునవ్వు మెఱసెను. షరాబు కనిపట్టి యిటులు ఉపక్రమించెను.—

రాష్ట్రముమీఁద వచ్చు ఆదాయ మంతయు ఆసత్రము ఒకనెలరోజులలో తినివేసెను. సత్రమున పదార్థములు అరుదాయెను. వంట లగునటులు కానిపింపలేదు. అప్పుడు మంత్రివచ్చి మహారాజులుంగారితో — అయ్యా! ధనము నిండుకొన్నది. సత్రము ఆఁపుదలచేయ ఆజ్ఞ యీయవలయును' అని మనవి చేసికోఁగా మహారాజులుంగారు విని—అప్రతిష్ఠ అప్రతిష్ఠ! తంజావూరు మహారాజు పొట్టకు పట్టెఁడన్నము పెట్టలేకపోవుటా? ధనము తీసికొని రండు, ధనము తీసికొని రండు! ఎక్కడనుండి యైనను సరియ— తీసికొని రండు! నేల త్రవ్వి తీసికొని రండు! అని సెల విచ్చెను.

ఈ మాటలు విని మంత్రి—అయ్యా! తమ బోటివారివలననే భూమికి రత్నగర్భ అని పేరు వచ్చినది. తమవంటి అమాయికుల వలననే నైష్కర్మ్యసిద్ధి అయత్నముగా లోకులకు సిద్ధించినది కాని దేవరవారు ఆలకింపవలయును. సత్రమునందు ఉన్నవా రందఱును సోమరిపోతులు కారు. నేనొక పరీక్ష చేసి అసలు సోమరిపోతులను తమకు చూపి వారికి మాత్రమే సత్రమునందు ఏర్పాటుచేసి మన ప్రతిష్ఠ కాపాడెదను. అందులకు తమ అనుజ్ఞ ఈవలెను అని వేడుకొనెను.

మహారాజులుంగారు మాట వినిపించుకొనినటులు కానరాలేదు. మంత్రి మరల ఇటు లనెను.—

దేవరవారు సోమరిపోతులకు ప్రభువులు. తమ చిత్తానుసారము నేల త్రవ్వించుటకు మాత్రము ధనమేది?

మహారాజులుంగారి చెవికి బాగుగా నాటెను.—మంత్రీ! మంచిది! పరీక్షచేయుము.

మంత్రి మహారాజును వెంటఁ బెట్టుకొని పోయెను. పాకలు పందిళ్లు ఇండ్లు అన్నియు తిప్పెను. ఓ! తిరునాళ్లు! బ్రహ్మసత్రము! ఏడ్చువారు, పొరలాడువారు. అన్నమునకు రమ్మని పిలుచుచో—ఆ తొందర ఏమి? ఉండవయ్యా అనువారు. ఈ రీతిగా పలురకముల వారు.

మంత్రి గాడిప్రొయినుండి కొఱవి ఒకటి తీసి పాకలకు అంటించెను. అగ్నిహోత్రుని ప్రతాపము ప్రారంభించెను. అగ్నిలో ఎన్ని రవ్వలు ఎన్ని కెంపులు ఉన్నవో! వానిని క్రక్క మొదలు పెట్టెను.

ఎక్కడివా రక్కడ లేచిపోఁ దొడఁగిరి. ఒకచోట మాత్రము మూవురు పడుకొనియుండిరి. మంత్రి దాపునకు వెళ్లి—మహారాజులుంగారు దయచేసినా రని బిగ్గఱగా అఱవఁగా ఒక్కఁడును కనులు తెఱచి చూడలేదు.

మంత్రి మరల—పాక లన్నియు కాలిపోవుచున్నవి లెండు లెండు అనెను.

అందొకఁడు—నడికొప్పు అంటుకోనీ అని అనెను.

కొంతసేపటికి నడికొప్పు కాలి తాటాకు మీఁదఁ బడఁగా వాఁడు మెల్లగా లేచి గజగమనముతో వెళ్లెను.

మంత్రి రెండవవాని కడకు వెళ్లి—నడికొప్పులు కాలి ఇండ్లు తగులఁబడి పోవుచున్నవని అఱచెను.

వాఁడు—బట్ట కాలనీ! అనెను. బట్ట కాలుచుండఁగా వాఁడు లేచి దులుపుకొనకుండనే మెల్లగా రెండడుగులు వైచెను.

మంత్రి మూఁడవవాని కడకుపోయి—ఓరీ! మంటలో మాఁడిపోవుచున్నావు అనెను.

వాఁడు కొంతవడికి కనులు తెఱవకయే కుడి డొక్క అంటుకోనీ! అనెను. అనుపదమే కుడి డొక్క అంటుకొనెను.—ఇదిగో కుడి డొక్క కాలుచున్నది లే అని మంత్రి చెప్పెను. —ఎడమడొక్క కాలనీ! అని అతఁడనెను. ఎడమడొక్క కాలుచుండఁగా నలుగురు పట్టి వానిని వాకిటికి ఈడ్చిరి.

అపుడు మంత్రి—వీరు మూవురుమాత్రమే తమ సత్రమునకు అర్హులు అని మహారాజులుం గారిని ఒప్పించి మిగిలినవారిని వెళ్లఁగొట్టి సత్రమును నిలిపి రాజుగారి ప్రతిష్ఠను కాపాడెను.

అని చెప్పి షరాబు కథ ముగించెను.

తిమ్మజగపతిరాజుగారి ముఖము విశాలమాయెను. అతఁడు షరాబును ప్రేమపూర్వకముగా చూచి తాటాకుమీఁద గంటముచే వ్రాలుపెట్టి అతనిని పంపివేసెను.



తిమ్మజగపతిరాజుగారి ముఖము విశాలమాయెను

౨

చైత్రనవరాత్రములు. దివాణమునందు నిత్యకల్యాణము పచ్చతోరణము. దాసికలకు, సేవకులకు, వారికి సంబంధించినవారికి, వారి తోకలకు, అందఱకు దివాణముననే విందు.

రొట్టలు వేఃకొనుచు దాసికలు విందుగుడుచుచుండిరి. విస్తళ్లలో భక్ష్యములరాసులు; నోటినిండా హాస్యప్రసంగములు; వలయును వలదు అను కేకలు; వడ్డనవారి సరసములు; వింతలు వినోదములు........

ఆసమయమున హఠాత్తుగా తిమ్మజగపతిరాజుగారు అచటికి వచ్చిరి. కొందఱు దా

సికలు లేచి నిలువఁబడఁగా మోకాలిపైకి తీసి కొనిన వస్త్రములతోపాటు చాటుగా దాఁచి కొన్న భక్ష్యములు నేలకు జారెను. దాచి కొన్న భక్ష్యములతో కొందఱు గర్భిణులనను కరించిరి. కొందఱు లేవక కూర్చుండియే యుండిరి. వారికెవరును వీరే మహారాజు లని ఎఱుక చేయలేదు.

రాజుగారిటు లనిరి—మీ రందఱును ఇచట నున్న సేవకులనుగాని, మరి మీయిష్టుల నుగాని పెండ్లాడవలయును. అటులుచేసి కొన రేని దేహిడీమన్నా.

ఒకరిమొగము లొకరు చూచుకొనిరి గాని ఎవరును బదులాడలేదు. రాజు నిష్క్రమించెను. గుసగుస లారంభమయి సంతగోల లోనికి డేఁకెను.

వృద్ధదాసి రాణికి విన్నపము చేయుదునని బయలుదేరెను. దానికుడిచేయి ఒకతె యు, ఎడమచేయి మరియొకతెయు పట్టుకొనిరి. మిగిలినవా రందఱు వెంట నడిచిరి. దాని కుడి కాలు సొట్ట. పేరుమాత్రము హంసీయాన. రాణీవాసమున ప్రవేశింప దాని కొకరియనుమతితో పనిలేదు.

అది ముందర రాణియెదుట పలవించెను రాణి ఓదార్చి—ఏమి ఆపద? అని అడిగెను. హంసీయాన—అమ్మా!ఆపదయనఁగా ఆపదా. పెండ్లికొమారులు పెండ్లిండ్లు చేసికొననిది మమ్ములను దివాణమున ఉంపరఁట. ఎంత



అమంగళము! సంసారులకు ముండమోయుట ఎంత ఆపదో మాకు పెండ్లాడుట అంత ఆపద. పోనిండు! అమ్మా! దేవరవారి సెలవుచొప్పున మే మందఱము పెండ్లి అయినవారమే. ఎటు లందురా మేము దేవదాసీలము. మాకందఱకు దేవునితో వివాహమైనది. కాదందురా మహారాజులే మాకు భర్త. తాము దేవరవారితో మా ఆడుకూయి వినిపింపవలయును. అనెను.

ఈ విన్నపములో మహారాజులే మాకు భర్త అన్నమాట రాణిచెవిలో రంయిమని మ్రోఁగెను. ఆమె కొంచె మాలోచించి లోనికివెళ్లి—ఈ సంగతి మహారాజుగారికే విన్నవించుకొమ్ము అని కబురు చేసెను. హంసీయాన లబలబలాడుచు మహారాజ దర్శనమునకు పోయెను. అతఁడు—పెండ్లియాడని దాసిమోము చూడనని తెలిపెను.

దానికి లొక్కరొక్కరే తఱలిరి. లోఁగడనే పెండ్లియైయున్నవారు కొందఱును, అపుడు పెండ్లియాడిన మరికొందఱును వేళ్ళమీఁద లెక్కపెట్టఁదగినటు లుండిరి. మహారాజు మనస్సులో ఒకశల్యము ఊడినటు లాయెను.

3

నాఁడు పంచమి. మంత్రిఆజ్ఞచే పలువురుసైనికులు ఒడ్డెసైనికుల వేషము తాల్చిరి. నాలుగైదు ఓఢ్రపుమాటలు వల్లించిరి. నాటి రాత్రి నగరము ముట్టడించునటులు అభినయింపుఁడని వారికి మంత్రి ఆదేశించెను.

రాత్రి దివాణమునందు పూజలు జరుగుచున్నవి. నౌకరులందఱు రాజాజ్ఞచే రావింపబడిరి. అందఱును మహాకాళికి మోఁకారిల్లి పిదప రాజునకు నమస్కరించి బారులు తీరి నిలువఁబడిరి. వారిలో నూటికి తొంబదితొమ్మిదిమంది అపుడే తమరాజును చూచిరి.

దేవపూజకుఁడు సహస్రనామార్చనము చేసెను. అవధారులు అయినవి. పండితుల పూర్వపక్షోత్తరపక్షకోలాహలము ముగిసెను. మంత్రపుష్ప మాయెను. నివేదన జరిగెను.

నౌకరులు బహుభక్తితో దేవిని చూచుచుండిరి. దాని కెక్కువగా ప్రసాదముమీఁద వారి కెక్కువ భక్తి కలిగెను. కనుల కద్దుకొనువారొకరు, మూతి కద్దుకొనువారొకరు, దాఁచికొనువా రొకరు, తినఁజూచువా రొకరు. రాజుగా రెదుట నుండుటవలన వారి మర్కటచాపలము గంతులవఱకు పోలేదు.

ఆ సమయమున నగరము వెలుపల పరాసు తుపాకులు మోఁగెను. పక్షులు గోల పెట్టెను. పశువు 'లంబా' యని అఱచెను. ఆకాశము గద్గదికతో రోదన మొనరించెనా యనునటు లుండె నాధ్వని ప్రతిస్పందము.

దేవపూజకుఁడు దేవితో చెప్పకయే పాఱిపోయెను. పండితులు చూచి వచ్చెదమని చెప్పుచు అదేఃపోత. సేవకులు అఱ్ఱెత్తి చూచుచుండిరి.

వేగులవాఁ డొకఁడు పాఱుతెంచి రాజుగారితో—అయ్యా! ఓఢ్రరాజు నగరిలోనికి పరువెత్తికొని వచ్చుచున్నాఁడు. దేవర యాజ్ఞ యేమి? అని మనవి చేసెను.

తిమ్మజగపతిరాజు సేవకులను జూచి—ఓరీ మీరు తల్లియెదుట నున్నారు. మానప్రాణములు పోవనున్న ఈ యుద్ధమునందు 'ప్రాణము లున్నంతవఱకు 'పోరాడుదుము' అని ప్రతిజ్ఞ చేయుఁడు అనెను.

ఒక వృద్ధసేవకుఁడు గబగబ దేవి యెదుటికిఁ బరువిడి 'ప్రాణము లున్నంతవఱకు నేను పోరాడుదును' అని ప్రతిన చేసెను. మరియొకఁడు చేసెను. గొఱ్ఱెల మందవలె అందఱును చేసిరి.

పిదప రాజు ఇటులు అనెను—మీరు వెనుక చూడక నా వెనువెంట రండు.

వృద్ధభటుఁడు రాజు ననుగమించెను. మరియొకఁడును.

మిగిలినవా రందఱు ఒకరిమొగ మొకరు చూచికొనిరి. ఎవరి మొగమునను నెత్తురుచుక్క లేదు.

ఒకఁడు వృద్ధభటునితో—నే నింటికిఁ బోయి గునప మెత్తికొని వత్తు ననెను. మరి యొకఁడు—తవుగోల తెత్తు ననెను. మరి యొకఁడు చాకు తెత్తు ననెను. ఇంకొకఁడు—సూది.

ఈమాట విని అందఱు నవ్విరి. రాజును, ముందర నున్న ఇరువురు భటులును వెనుదిరిగి చూడకయే చనుచుండిరి. వారికిని వీరికిని చాల వ్యవధాన ముండెను. క్రమక్రమముగా వారు వీరికి కానిపించుటయే లేదు.

ఈ భటులలో ప్రధానుఁడు మిగిలినవారితో—ఓరీ మన మింటికిఁ బోయి భార్యాపిల్లలను తీసికొని పాఱిపోదమా లేక ఒంటరిగా పాఱిపోదమా?' అని అడిగెను.

గుభుగుభుమని తుపాకి మోఁతలు వినబడెను. మరి ప్రశ్న లేదు; సమాధానము లేదు. ఎవరిత్రోవ వారిదే. పాఱిపోవుటలో అసహాయ శూరులు! భూమిలో పూఁడిపోయినటులు వా రొక్కరును కాన రాలేదు.

రాత్రి చాలసేపటి దాఁక తుపాకులు మోఁగుచునే యుండెను. రాజు ఎంతసేపు వెనుదిరిగి చూచినను ఇరువురు తక్క మరి భటులు లేరు. యుద్ధ మంత మైనది. రాజుగారికంటె భటుల కెక్కువ జయము కలిగినది.

౪

నాఁడు నవమి, ప్రొద్దు గ్రుంకెను. అపుడు యామినీపూర్ణతిలక పాట.

తిమ్మజగపతిరాజుగారు గానరసమును నిక్కముగా ఎఱిఁగినవానిని కనిపట్టవలయునని పవలంతయు ఆలోచించెను. ఆలోచన అయిన వెంటనే మృదువేషముతో సభను అలంకరించెను. సభ్యులందఱు లేవఁబోవుచుండఁగా వలదని వేఁడుకొని నమస్కరించి దిండును ఆనుకొని కూర్చుండెను. సభ్యులును కూర్చుండిరి.

రాజబంధువు లొకచోట, ఉద్యోగు లొకచోట, పండితు లొకచోట, పామరు లొకచోట, నడుమ రాజు. రాజుముందు యామినీపూర్ణతిలక.

'తిలక పాడ నారంభించెను. సభ్యుల తలయూఁపు లారంభ మాయెను. భేషుభేషు నాదములు. హెచ్చరికలు. 'తిలక కృతజ్ఞత తెలుప సభకు జేతు లెత్తెను.

సభ్యులకు మరికొంచెము ఉత్సాహము. ఈతూరి ఇందాఁకటికంటె ఎక్కువగా ఊఁపుద మని కొందఱనుకొనిరి. ఎంత తలనూఁపిన అంత అభిజ్ఞత!

'తిలక పంచమశ్రుతిలో పాడుచుండఁగా రాజోద్యానమున కోయిలలు కోకో యని కూసినటులున్నవని రాజబంధు వొకఁడు కీర్తించెను. సభ్యుల ఆహానాదము భేరినాదమువలె మిన్ను ముట్టెను. 'తిలక షడ్జ

శ్రుతిలో పాడఁగాఎద్దుఱంకెవలె నున్నదని రాజు గారి బావ. సభ్యుల బళీనాదము ఱంకెవలె ఉండెను.

గీతములు, వర్ణములు, కృతులు అయిన వెనుక తిలక రాగ మాలపింపఁదొడఁగెను. ఆమె శుద్ధములును విజాతీయములును అగు భావములనే సంచారము చేసెను.

రాజ బంధువులలో తలయూఁపులు; పండితులలో శిరశ్చాలనములు; పామరులలో తలత్రిప్పులు; ఉద్యోగులలో తల తిరుగుళ్లు. అందఱకు శిరఃకంపమా? ఆశిరఃకంపములకు వీవనలచే విసిరినటులు గాలివీచెను. సభ్యులు రాగమునయందు ఆరోహణమునకు తలలెత్తిరి. అవరోహణమునకు తలలు దింపిరి. పాట వినుటకు పాతాళమునుండి పన్నగరాజు పైకి వచ్చి తన వేయిపడగలను ఆడించుచుండెనా?

కొందఱు తాళము వేయుచుండిరి. కొందఱు-బాగుబాగు-అనుచుండిరి. ముందరనున్న రాజబంధు వొకఁడు తన యభిజ్ఞత లెస్సగా తెలుపుటకుఁ గాబోలు తల నూఁపెను. ఊఁపుతో శిరస్సుపైనున్న ముప్పదిమూరల పాగ' తిలకకు దాపుగా పడెను. తిలక త్రుళ్లిపడెను. ఒకతూరి సభా సభా నివ్వెరపడెను.

తిలక చిఱునవ్వుతో మరల అందుకొనెను. వెంటనే తలయూఁపులు.

రాజు సేనాపతి దిక్కు చూచెను.



సేనాపతి ముందరికి వచ్చి—మీలో ఎవరు తలత్రిప్పుదురో వారితల ఈకత్తికి బలి అని నిలువఁబడెను. తరువాత చాలమంది సైనికులు బిలబిలమని వచ్చి విచ్చుకత్తులతో నడుమనడుమ నిలువఁబడిరి.

తిలక నిర్భయముగా కూర్చుండెను, ఆమె చక్రము త్రిప్పినటులు, తీఁగ ప్రాఁకినటులు. లత చెక్కినటులు, ఈశ్వరుని క్రొత్తక్రొత్త విభూతులు చూపుచున్నటులు, నాదబ్రహ్మమున తాను లీనయయి సభ్యులను లీనులఁగావించి మృదువుగా, మనోహరముగా అటిటు కదలక బొమ్మవలె, సరస్వతివలె పాడెను.

సభ్యులకు, అందును ముని ముందు కూర్చున్న సభ్యులకు వాక్కు ఉన్నటులు లేదు; తలలు అసలు ఉన్నటులే లేవు.

ఆహాయనక, బళీయనక, భేషనక, ఇతరుల మోములను చూడక, ఆనందజడులైన



అంతర్ముఖు లౌక లిరువురు ఏకాగ్రతతో చెవులలో మనస్సు పెట్టుకొని నడుమనడుమ తల లాడించుచుండిరి. మిగిలినవారు తమ్ముఁజూచి పరిహసించుటయు వారెఱుఁగరు.

తిమ్మజగపతి రాజు గారు లేచి వారికడకు వెళ్లి అయ్యా— తాము ఈ కృపాణమును కరుణించినారు. మీ అభిజ్ఞత స్మృతికి ఆనల అని వినయవినమితు లైరి.

అధీరధీరగతులు

శ్రీ విక్రమదేవవర్మగారు

ఇంచుకంత దెలియు నీలోకభవులె యు,
క్లేశ మింతలేక దేనిఁ జేయ
రిట్టులుండఁ జేయునే? యెట్టివని నను
ద్దిష్టుఁడగుచు నన్ని దెలియు విభుఁడు.

ఒకొకమనుజుని సృజియింప నొకొకలక్ష్య
ముండుఁగద యహంకృతి నధీరుండు దానిఁ
దెలియలేకెన్ని యోమార్గములను ద్రొక్కి
చేయవలసినదానిని జేయలేక

పొందవలసిన దానిని బొందలేక
చచ్చు చొదవుచు సంసారచక్రమందు
భ్రమణమొందుచు దుఃఖాంబురాశిమునిఁగి
తేలెడు విధాన మారయంజాలఁ డహహ!

బుధుఁ డహంభావమును బాసి విధిగఁ జేయఁ
దగు పనుల స్వార్థరాహిత్యముగ నొనర్చు
చీశభక్తుఁడై ఘోరసంసృతిని మీఱి
శాశ్వతానందమయమగు స్థానమొందు.